ఇకపై డిజిటల్, స్మార్ట్ బోధన

- బోధనలో కొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు బోధపడతాయి
- మండలానికి 47 ఐఎఫ్‌పీ, 17 స్మార్ట్ టీవీలు

నల్లజర్ల: విద్యా బోధనలో ఆధునిక టెక్నాలజీకి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి విద్యార్థికీ పాఠాలు సులభంగా అర్థం అయ్యేందుకు ఏయే వనరులు అవసరమో, వాటన్నింటినీ పాఠశాలలకు సమకూరుస్తోంది. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి వరకూ తరగతి గదుల్లో బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో రాస్తున్నారు. ఇప్పుడు వాటి స్థానంలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్)లను అందుబాటులోకి తెస్తున్నారు.

మండలానికి..

ఇప్పటికే ప్రభుత్వం నల్లజర్ల మండలానికి 47 డిజిటల్ ఫ్లాట్‌ప్యానల్ బోర్డులు, 17 స్మార్ట్ టీవీలను సమకూర్చింది. నాడు-నేడు ఫేజ్-1 పనులు పూర్తయిన పాఠశాలలకు వీటిని అందించినట్టు ఎంఈఓ-2 బి.భగవతి చెప్పారు. వీటిని ఏర్పాటు చేస్తున్న పాఠశాలలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐఎఫ్‌పీలను, స్మార్ట్ టీవీలను ఆయా పాఠశాలల్లో సాంకేతిక నిపుణులు అమర్చుతున్నారు. ఇంటరాక్టివ్ ఫ్యాట్ ప్యానల్ బోర్డులను ఏ విధంగా వినియోగించాలనే విషయమై ఇప్పటికే ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకూ ఉపాధ్యాయుడు కొత్త విషయాలను విద్యార్థులకు చెప్పాలంటే సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి వచ్చేది. కొత్త విధానం అందుబాటులోకి వస్తే ఒక క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలనూ చూపించవచ్చు. ఈ విధానం వల్ల విద్యార్థులకు కొత్త అంశాలు సులభంగా అర్థం అవుతాయి. లెక్కలు,సైన్సు పాఠ్యాంశాల బోధన సమయంలో కొన్ని చిత్రాలు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉపాధ్యాయుడు వాటిపై బ్లాక్‌బోర్డుపై చాక్‌పీస్‌తో వేసి విద్యార్థులకు వివరిస్తున్నారు.



పోతవరం హైస్కూల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు అమర్చుతున్న నిపుణుడు

ఇదో నూతన ఒరవడి



విద్యా విధానంలో ఇదో నూతన ఒరవడి. ఐఎఫ్‌పీ విధానంలో బోధన వల్ల పాఠ్యాంశాలను విద్యార్థులు గుర్తుంచుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకూ బ్లాక్ బోర్డుపై చెప్పిన వాటినే ఈ విధానంలో చెబుతాం.ఎక్కువ కాలం విద్యార్థుల మదిలో పాఠాలు నిలిచిపోతాయి.

– బి.భగవతి, ఎంఈఓ-2, నల్లజర్ల మండలం

ఇకపై అలాంటి పని ఉండదు. గతంలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే వెంటనే వాటిని బోర్డుపై ప్రదర్శించి నివృత్తి చేయవచ్చు.

బోధించడం సులభం

ఈ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలైనా సులభ రీతిలో బోధించేందుకు అవకాశం ఉంటుంది. అదీగాక దృశ్య, శ్రవణ విధానంలో పాఠ్యాంశాలు బోధించడం వల్ల విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంది. మ్యాపులు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను నేరుగా ఫొటోలతో సహా చూపించడానికి వీలవుతుంది.

క్లుప్తంగా

కోటసత్తెమ్మ ఆదాయం రూ.1.81 లక్షలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి విశేష పూజలు చేశారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం రూపంలో రూ.1,80,902 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) పేర్కొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సొసైటీ అధ్యక్షుడిగా 'సుంకర' బాధ్యతల స్వీకరణ



సొసైటీ చైర్మన్ సుంకర సత్యనారాయణ, సభ్యులను సత్కరించిన నాయకులు

కొవ్వూరు: కాపవరం సొసైటీ నూతన త్రీమెన్ కమిటీ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, సభ్యులుగా దేచెర్లకు చెందిన కంచుమర్తి బాల శంకరం పంతులు, ధర్మవరానికి చెందిన వెంపాటి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా త్రీమెన్ కమిటీని నాయకులు ఘనంగా సత్కరించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, నాయకులు వెంపాటి సురేష్, గోశాల శ్రీనివాస్, ఎన్.భూపతి, పల్లి రత్నకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రోటరీ క్లబ్‌కు అవార్డు



మెంబర్ షిప్ పురోభివృద్ధి అవార్డు స్వీకరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ మెంబర్‌షిప్ పురోభివృద్ధి అవార్డు దక్కించుకుంది. ఈ క్లబ్ 99 మంది సభ్యులతో మొదటి స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో విజయనగరంలో శనివారం రాత్రి నిర్వహించిన రోటరీ ఇంటర్నేషనల్ మీట్‌లో రోటరీ గవర్నర్ చేతుల మీదగా క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనే యులు అవార్డు స్వీకరించారు.

చీపురుగూడెంలో వైద్య శిబిరం

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని తులసి ఆసుపత్రికి చెందిన పీస్ ప్రసాద్ చౌదిరి నేతృత్వంలోని వైద్య బృందం దాదాపు 100 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ హరిప్రసాద్, గ్రామపెద్దలు గాలింకి రాంబాబు, తలంశెట్టి మాధవరావు, హరిబాబు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: ఇంటి పేరుతో దూషించి దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. సమిశ్రగూడేనికి చెందిన దిద్దే అజయ్‌కుమార్‌ను అదే గ్రామానికి చెందిన మెరిపే విజయరాజు, విజయ్‌కుమార్, ముప్పిడి ప్రతాప్ అనే ముగ్గురు ఈనెల 5వ తేదీ రాత్రి ఇంటి పేరుతో దూషించడమే గాకుండా దాడి చేశారు. గాయాలైన అజయ్‌కు నిడదవోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు అజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

బురద తొలగించారు



గోష్పాద క్షేత్రంలోని రోడ్డుపై ఉన్న బురద మట్టిని తొలగిస్తున్న యంత్రాలు

సాక్షి ఇంపాక్ట్

కొవ్వూరు: గోదావరి వరద సమయంలో కొవ్వూరు గోష్పాద క్షేత్రం రోడ్లపై పేరుకుపోయిన బురద మట్టిని తొలగించక పోవడంపై కలెక్టర్ కె.మాధవీలత స్పందించారు. తక్షణం గోష్పాద క్షేత్రంలోని రోడ్లన్నింటినీ శుభ్రం చేయాలని ఆమె ఆదేశించారు. 'వరద తగ్గినా బురద తొలగించరే' అనే శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. క్షేత్రాన్ని తక్షణం శుభ్రం చేయించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కొవ్వూరు మునిసిపల్ కమిషనర్ బి. శ్రీకాంత్‌ను ఆదేశించారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి మినీ జేసీబీ, యంత్రాల సాయంతో ఈ క్షేత్రంలోని రోడ్లపై పేరుకుపోయిన ఒండ్రు మట్టిని, బురదను తొలగించి శుభ్రం చేశారు. దాంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

శ్మశానవాటిక సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తాళ్లపూడి: దశాబ్దాలుగా కోరుతున్న దళితుల శ్మశానవాటిక రోడ్డు నిర్మాణం హోం మంత్రి తానేటి వనిత చొరవతో ఇప్పుడు సాకారం అవుతోందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో దళితుల శ్మశానవాటిక సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే అక్కడి ఎస్సీ పేటలో కమ్యూనిటీ హాల్ మైదానం మెరక పనులకు కూడా ఎంపీపీ శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.24 లక్షల వ్యయం ఈ రెండు పనులు చేపడుతున్నారు. పార్టీలకు అతీతంగా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొని, మంత్రి తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ నాయకులు సిర్రా గంగారావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఎం.దమయంతి, వార్డు సభ్యులు కొయ్యే మంగ, స్వర్ణకుమారి, తిగిరిపల్లి సంపతి కుమారి, నాయకులు నరాలశెట్టి వీరవెంకటరావు, కృష్ణార్జునుడు, తిగిరిపల్లి ప్రసాద్, ఆశోక్, సిర్రా గోపి, గెడ్డం వెంకటేశ్వరరావు అరుంధతీ యూత్ పాల్గొన్నారు.



పెద్దేవంలో దళితుల శ్మశానవాటిక సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

సేవాభావమే వారి స్నేహానికి వారధి

నల్లజర్ల: వారందరూ ఒకే తరగతిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కాదు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే సేవాభావమే వారందరినీ స్నేహితులను చేసింది. వివిధ రంగాల్లో స్థిరపడినప్పటికీ వారు అనాథలను, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటారు. మొత్తం 15 మంది సభ్యులు. అనంతపల్లి యూత్ క్లబ్‌గా ఏర్పడ్డారు. అనంతపల్లి కేంద్రంగా నల్లజర్ల మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు, వారి గమ్యస్థానాలకు పంపే బాధ్యతను ఈ క్లబ్ సభ్యులు పర్యవేక్షిస్తారు. నల్లజర్లలోని అనాథ పిల్లల వసతి గృహం విద్యార్థుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. వారికి అవసరమైన చాపలు, పరుపులు, బెడ్‌షీట్‌లు అందిస్తుంటారు. ఇలా పలు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహిస్తున్న అనంతపల్లి యూత్‌క్లబ్ సభ్యులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అనంతపల్లిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డేవిడ్, వెంకటస్వామి, గాంధీ, కాశీ, శ్రీను, కృష్ణ, జిలానీ, కడియం కృష్ణ ,టీఎస్ఎన్‌లు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



అనంతపల్లిలో కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుకుంటున్న అనంతపల్లి యూత్ క్లబ్ సభ్యులు

మూడు నియోజకవర్గాల్లో నేడు చంద్రబాబు రోడ్ షో

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని మూడు నియోకవర్గాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రోడ్ షోకు తెలుగు తమ్ముళ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలవరం, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో చంద్రబాబు రోడ్ షో నిర్వహిస్తారు. ఉదయం పోలవరం నియోజకవర్గలో పర్యటన అనంతరం కొవ్వూరు నియోజకవర్గలోని తాళ్లపూడి, ప్రక్కిలంక, గజ్జరం, అన్నదేవరపేట, గోపాలపురం నియోజకవర్గంలోని ఆ మండలం చిట్యాల, వేళ్లచింతలగూడెం, గోపాలపురం గ్రామాల్లో రోడ్ షో జరుగుతుంది. అక్కడ నుంచి దేవరపల్లి హైవే వద్ద గల డైమండ్ జంక్షన్‌కు చేరుకుంటుంది. అక్కడి దేవరపల్లి మూడు రోడ్ల కూడలికి చేరుకుంటుంది. అక్కడ సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన సభలో అధినేత చంద్రబాబు నాయుడు ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తారు. సభ అనంతరం హైవే మీదుగా రాజమహేంద్రవరం చేరుకుంటారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు.

గుండేపల్లిలో రంగా విగ్రహావిష్కరణ



వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ దృశ్యం

నల్లజర్ల: కాపు ఉద్యమ నేత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని మండలంలోని గుండేపల్లి గ్రామంలో ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆంధ్రా, తెలంగాణ రాధా-రంగ మిత్ర మండలి ట్రస్ట్ అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు ఆవిష్కరించారు. కార్యక్రమానికి బోడపాటి కేశవ దేవరాయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కందుల రవిశేఖర్, చోడసాని బాపిరాజు, రుద్రా శ్రీనివాస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దళితుల ఊచకోతలు పాలకుల వైఫల్యమే

నిడదవోలు: పాలకులు అనుసరించిన విధానాలే కారంచేడు, చుండూరుల్లో దళితుల ఊచకోతలకు కారణమయ్యాయని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ ఆరోపించారు. ఆగస్టు 6న చుండూరు దళిత నర మేధానికి నిరసనగా స్థానిక ఇందిరానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు యెల్లమిల్లి వరప్రసాద్, రవ్వ సురేష్ కుమార్ మాట్లాడుతూ కారంచేడు, చుండూరుల్లో దళితులపై మారణాయుధాలతో దాడి చేసిన వందలాది అగ్ర వర్ణ దురహంకారులు నిర్దోషులుగా యథేచ్ఛగా తిరుగుతుండడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు యెల్లమిల్లి చంటి, చైతన్య, గుంటు జగదీష్, బాలు, బవిరిశెట్టి నాగేంద్ర, హేమంత్ కుమార్, మురళీ, విశ్వాస్, రాజ్ కుమార్, కార్తీక్ , యెలగాడ రాజ్‌పాల్ పాల్గొన్నారు. అలాగే స్థానిక చర్చిపేట అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు అధ్యక్షతన చుండూరు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు. టి.నాని, గండి శ్రీనివాసరావు, గండి శేఖర్, లెనిన్, పోసి, సాగర్, రవి సంతోష్ , టీ రాజు, అభిమన్యుడు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

దళిత మృత వీరులకు నివాళులు

నిడదవోలు రూరల్: దళితులపై అగ్రవర్ణాల దాడులను నిరసిస్తూ మండలంలోని సమిశ్రగూడెంలో కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. చుండూరులో 32 ఏళ్ల క్రితం అసువులు బాసిన 8 మంది దళిత మృత వీరులకు కేఎన్‌పీఎస్ నాయకులు నివాళుర్పించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ముప్పిడి కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఖండవల్లి బాలికలకు నర్తనబాల అవార్డులు

పెరవలి: తమ నాట్య కౌశలంతో ఆ ఇద్దరు చిన్నారులు నర్తలబాల జాతీయ పురస్కారాలు గెలుచుకున్నారు. నృత్య భారతి అనే సంస్థ ఏలూరులో నాట్యాచార్య డి.హేమసుందర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నృత్య పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో పాల్గొన్న మండలంలోని ఖండవల్లికి చెందిన ఖండవల్లి హాసిని, సానబోయిన జ్యోత్స్న పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ క్రమంలో వారిద్దరికీ బాల్యంలోనే నాట్యంలో విశేషంగా రాణించే కళాకారులకు అందించే నర్తన బాల జాతీయ పురస్కారాలు దక్కాయి. ఏలూరు మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి చేతుల మీదుగా హాసిని, జ్యోత్స్నలు ఈ అవార్డులు అందుకున్నారు. ఈ బాలికలు ఇద్దరూ ఖండవల్లి గ్రామంలోని సర్వోదయ విద్యానికేతన్‌లో ఏడో తరగత చదువుతున్నారు. నృత్య ప్రియ డ్యాన్స్ అకాడమీలో నృత్యం నేర్చుకుంటున్నారు.



నర్తనబాల జాతీయ పురస్కారాలు స్వీకరిస్తున్న హాసిని, జ్యోత్స్న

ఫుట్‌బాల్ టోర్నీ విజేత పల్లంట్ల జట్టు

దేవరపల్లి: ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పల్లంట్ల మిరాకిల్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక నారాయణ శ్రీకాంత్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇక్కడి ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో కొవ్వూరు జట్టుపై పల్లంట్ల జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతిగా రూ.15 వేల నగదు కైవసం చేసుకుంది. ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు కొవ్వూరు జట్టు గెలుచుకోగా, తృతీయ బహుమతిగా రూ.5 వేలను రాజానగరం జీఎస్ఎల్ జట్టు దక్కించుకుంది. ఆదివారం సాయంత్రం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. రాయల్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో విజేత జట్టుకు షీల్డ్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాహుల్ (ఫైల్)

నల్లజర్ల: ఇక్కడి నుంచి పుల్లలపాడు వెళ్లే రోడ్డుపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో దూబచర్ల గ్రామంలోని గాంధీ కాలనీకి చెందిన బోడిగడ్ల రాహుల్ (23) అనే యువకుడు మృతి చెందాడు. బైక్‌పై రాహుల్ నల్లజర్ల వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో రాహుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి బైక్ చక్రాలు సైతం ఊడిపడిపోయాయి. వెంకటేశ్వరావు, రమణమ్మ దంపతులకు ముగ్గురు ఆడ పిల్లల తర్వాత పుట్టిన మగ సంతానం రాహుల్. చేతికంది వచ్చిన కొడుకు దుర్మరణం చెందడంతో ఆ తల్లిదండ్రులు ఘటనా స్థలంలో కన్నీరు మున్నీరుగా విలపించారు. నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జిని ఢీకొట్టిన కారు

మారేడుమిల్లి: విహారంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు రెండు బైకులపై విహారయాత్రలో భాగంగా మారేడుమిల్లి వచ్చారు. ఆదివారం వారు తిరిగి బయలుదేరారు. ఇదే మార్గంలో మారేడుమిల్లికి సమీపంలోని మాటుమామిడి బ్రిడ్జి వద్ద ఆగారు. వారిలో ఇద్దరు మహిళలు పింకి, లక్ష్మి బ్రిడ్జిపై నిలబడి ఫొటోలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో బ్రిడ్జిని కారు ఢీ కొట్టడంతో వారిద్దరూ కాలువలో పడి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే కారుకు సంబంధించిన వారు అక్కడి నుంచి పరారయ్యారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ గణపతి మృతి

నిడదవోలు: పట్టణానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ మడగల గణపతి (65) ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, జి.ప్రసాద్, ఆకుతోట సతీష్, మంచంశెట్టి గోవిందరాజు ఎ. విజయ్ కుమార్, తన్నిడి బోస్ తదితరులు గణపతి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా మద్దిపాటి

చాగల్లు: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా ఊనగట్లకు చెందిన మద్దిపాటి సురేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. మండలంలో బీజేపీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో సత్తా చాటేందుకు కృషి చేస్తానని సురేష్ తెలిపారు. సురేష్‌ను ఆ పార్టీ నాయకులు పిల్లలమర్రి మురళీ కృష్ణ, కరుటూరి జగదీశ్వరరావు అభినందించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కొవ్వూరు: ఐ.పంగిడి పంచాయతీ గ్రామ సౌకరు యాళ్ల బాలరాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తమ వంతు తక్షణ సాయంగా రూ.10 వేల విరాళాన్ని,100 కిలోల బియ్యాన్ని ఆదివారం బాలరాజు కుటుంబానికి అందజేశారు. సర్పంచ్ గోశాల నాగర్జున, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు కామన రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.



సాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- పలు ప్రాంతాల్లో నిరసనలు
- క్రైస్తవుల శాంతి ర్యాలీలు

కొవ్వూరు: బీరేన్ సింగ్ నాయకత్వంలోని మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని దళిత రక్షణ దళం నాయకుడు కొడమంచిలి రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని క్రిస్టియన్ పేట కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో 257 చర్చిలను తగలబెట్టడం, 142 మంది మృత్యువాత పడడం బాధాకరం అన్నారు. ప్రగతిశీల కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్, సీపీఐ(ఎం ఎల్) రెడ్ ఫ్లాగ్ రాష్ట్ర నాయకుడు మరీద్ ప్రసాద్, రైతు కూలీ సంఘం నాయకుడు ఎం. సుభాకర్, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు, సిర్రా గోపాల్, సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. 32 ఏళ్ల క్రితం జరిగిన చుండూరు మారణ కాండలో మృతి చెందిన 8 మంది దళితులకు అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నివాళులు అర్పించారు.



కొవ్వూరు మండలం వాడపల్లిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

వాడపల్లిలో శాంతి ర్యాలీ

మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వాని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వాడపల్లి గ్రామంలో ధర్నా చేశారు. బైబిల్ మిషన్ ఫుల్ గాస్పెల్‌ప్రేయర్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బళ్లా క్రిస్టియన్ పాల్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. అప్పన్న చౌదరి, గెడ్డం మధుబాబు, బొంతా శ్యాం ప్రకాష్, చోళ్ల రాజు, కిరణ్‌కుమార్, మరపట్ల కళాధర చక్రవర్తి, సంఘ పెద్దలు, దైవజనులు పాల్గొన్నారు.

చాగల్లు: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలంలోని దారవరం ముస్లిం యువజన సంఘం సభ్యులు ఆదివారం నిరసన తెలిపారు. వారంతా దారవరం నుంచి చాగల్లు ప్రధాన రహదారి వద్దకు శాంతి ర్యాలీ చేశారు. మణిపూర్‌ను రక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు.

గోపాలపురం: ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే స్పందించి మణిపూర్ ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ కార్యదర్శి తానేటి రాజు డిమాండ్ చేశారు. మణిపూర్ నరమేధాన్ని నిరసిస్తూ గోపాలపురంలోని సబ్‌స్టేషన్ వద్ద నుంచి బస్ స్టాండ్ మీదుగా చెక్ పోస్టు సెంటర్ వరకూ క్రైస్తవులు ఆదివారం ర్యాలీ చేశారు. అక్కడ మోకాళ్లపై నిలబడి ప్రార్థనలు నిర్వహించారు. గోపాలపురం పోలీసులకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని పాస్టర్లు ఎంజే సుధాకర్, ప్రవీణ్‌కుమార్, పి జక్రయ్య, జాన్‌పాల్, శామ్యూల్ రాజు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.